# నగరంలో అడవి

డా॥ కేతు బుచ్చిరెడ్డి

గణేశ్ పెద్ద పోస్టాఫీసు చేరుకున్నాడు. మేడమీదున్న పెద్ద పోస్టాఫీసు రద్దీగా ఉంది. ఎవరి పనుల్లో వారు తలమునకలుగా కనిపిస్తున్నారు. మంగళగిరి శానిటోరియంలో చేరి క్షయవ్యాధికి చికిత్స పొందుతున్న తల్లికి వారానికో ఉత్తరమ్ముక్క వ్రాయటం గణేశ్ అలవాటుగా పెట్టుకున్నాడు. దాదాపు ప్రతి ఉత్తరంలోనూ విషయం ఒకటేగా ఉంటుంది. వేసే తేదీ తప్పిస్తే!

"పూజ్యులైన అమ్మ పాదపద్మములకు-నీ కుమారుడు గణేశ్ నమస్కరించి వ్రాయు జాబు—

ఇక్కడ మేమంతా క్షేమం. ఊరి నుండి ఎవరో ఒకరు నా దగ్గరికొస్తూనే ఉన్నారు. నాన్న, చెల్లి, తమ్ముడు అంతా క్షేమం. నీవు ఎవరిని గురించీ బెంగ పెట్టుకోవద్దు. నాన్న నీకు డబ్బు సక్రమంగా పంపిస్తున్నాడు గదా! పాలు, పళ్ళు, గుడ్లు బాగా తీసుకో. డాక్టర్లు ఇచ్చిన మందులు సక్రమంగా వాడు. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో. నీ నుండి చాలా రోజులుగా జాబులేదు. ఏమ్మా! మా పైన కోపమొచ్చిందా? ఇంకెంత, తొందరలోనే నీవు మా దగ్గరి కొచ్చేయొచ్చు. నేను బాగా చదువుకుంటున్నాను...."

ఇలా అలవాటు ప్రకారం బరబరా గికేశాడు గణేశ్ తల్లికి జాబు.

ఉత్తరం మడిచి, నాలుక తడితో కవరు నోరు మూశాడు! పెన్నుకు మూత తగిలించి జేబులో పెట్టుకున్నాడు. జేబులో వున్న సినిమా టికెట్ మ్యాట్నీకి తొందర చేస్తోంది. 'ఆంధ్రుల అందాల హీరో.' తన అభిమాన నటుడి, ఉజ్వల పౌరాణిక చిత్రరాజం ఆ దినమే రిలీజయింది. మార్నింగ్ షోకే—చెమటలు పట్టి, చొక్కా చింపుకొని ఎంతో కష్టపడ్డా టికెట్ దొరకలేదు. కనీసం మ్యాట్నీకైనా తన అభిమాన హీరో సినిమా చూడాల్సిందే! తనే ఎప్పుడూ, విడుదలైనరోజే మార్నింగ్‌షో చూసి, తన మిత్రులందరికీ వార్త నందించేది. లేకపోతే తలతీసేసినట్లు అవమానంగా, బ్రతుకే భారంగా, నీరసంగా, అయోమయంగా, అర్థవిహీనంగా ఉంటుంది. అభిమాన సంఘానికి అధ్యక్షుడుగా ఉండి కూడా ఇంకా చూడకుండా వుంటే, వేరే హీరో పార్టీవాళ్ళేకాదు, ఎవరైనా సులభంగా నవ్వేస్తారు! రాత్రికినిద్ర పట్టదు. తెల్లారి మిత్రుల ఎదుట తల ఎత్తలేడు. మొదటి రోజు చాలా మందే చూస్తారు రిలీజయిన సినిమా. కానీ, మార్నింగ్, కనీసం మ్యాట్నీ షో చూస్తేనే క్రెడిట్ అందుకే ఆ రోజు కాలేజీ క్లాసులు త్యాగంచేసి ఉదయం నుండి ప్రయత్నించి

తన అభిమాన అందాల హీరో సినిమా మ్యాట్నీ షోకి టికెట్ రిజర్వుచేసి జేబులో భద్రం చేసుకున్నాడు. తన మనసంతా ఆ సినిమా-ఆ హీరోమీదే ఉంది. తొందరగా రూమ్ చేరుకోవాలని కదిలిన గణేష్, "నాయనా"! అన్న పిలుపు విని బ్రేక్ వేసినట్టు ఆగిపోయాడు.

"ఏం?! అన్నట్టు అసహనంగా చూశాడు పిలిచి ఎదురుగా నిలచిన ముసలాయన ముఖంలోకి.

తలకు పెద్ద పేటా చుట్టి ఒక ప్రక్క దారంతో కట్టి వున్న కళ్ళద్దాలుపెట్టి, ముడతలు పడ్డ శరీరాన్ని కప్పడానికి వృధాగా ప్రయత్నిస్తున్న చిరుగులు పడ్డ ఆ పారం చొక్కా. మోకాళ్ళ పైకి మాసిపోయిన పంచె ఎగకట్టి; ఆశగా గణేశ్ ముఖంలోకి చూశాడు ముసలాయన. మూడు మైళ్ళ పల్లెనుండి ఎండలో నడిచి వచ్చినందువల్ల చెమటలో తడిసిపోయాడు. ముఖమంతా నల్లగా వాడిపోయింది.

ఎవరో బిచ్చగాడు, డబ్బు అడుగుతాడేమో అనుకున్నాడు గణేశ్. ఇంతలో తన స్నేహితుడు "హాయ్ గణేశ్!" అనటంతో "హాయ్ రాజా" అంటూ పలకరించి షేక్‌హాండిచ్చాడు.

ముసలాయన వాళ్ళిద్దరి ప్రక్కనే నిలుచున్నాడు. "నాయనా, జాబు లెక్కడిస్తారు" అని అడిగాడు.


"ఎవరైనా రాస్తే, పోస్ట్‌మాన్ తెస్తాడు. నీకు .... ఓ యు మీన్ .... పోస్ట్ కార్డ్స్, ఇన్‌లాండ్ కవర్స్...." ఏదో విట్టేసినట్లు దాదాపు ఫిట్టొచ్చిన రోగిలా నవ్వుతూ అన్నాడు రాజు.

"అయ్యో నాయనా! కార్డ్లు ఇంగ్లాండు కవర్లు యాడిస్తారు." అమాయకంగా అడిగాడు ముసలాయన. "ఇం....గ్లాం..డు కవర్లు అయ్యి పోస్టాపీసులో ఇత్తరు పెద్దయ్యా" తనేం తక్కువ తినలేదని, దొకొచ్చే జోకొకటి వేశాడు గణేశ్.

ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు. ముసలాయన తనని గేలిచేస్తున్నారని పసిగట్టి, అక్కడి నుండి కదిలి, స్టాంపులు, కవర్లు, కార్డులమ్మే కౌంటర్ దగ్గరి కెళ్ళి "నాయనా మావాడికి జాబురాయాల....అదే కార్డ్లు యాడిస్తారు?" అని అడిగాడు. కౌంటర్‌లో వ్యక్తి, "ఇక్కడే ఇస్తా" రంటూ ముసలాయన దగ్గర డబ్బుతీసుకొని ఒక కార్డు చేతిలో పెట్టాడు.

"ఇది నా కొడుక్కి రాసిపెట్టు నాయనా మిలిట్రీలో సేరి శానాదూరంగా, శత్రుల్తో ఇద్దం సేస్తన్నాడు. డబ్బు దస్కం రాక పోతేమానె, ఈ మద్దెన అద్నుండి జాబు కూడ కరవైనాది. ఎట్టుండాడో బిడ్డ" అంటూ తన కొడుకు వ్రాసిన జాబులో వుండిన అడ్రసు ఆత్రుతతో ఆయన చేతికివ్వబోయాడు.

"బాగుందయ్యా నీ యవ్వారం. నేను రాసిపెట్టడానిక్కాదయ్యా ఇక్కడుండేది. ఇవి అమ్మడానికి, మీ లాంటోళ్ళకి రాసిపెట్టడానిక్కూడా ఒకర్ని అపాయింట్ చేస్తే బాగుణ్ణు గవర్నమెంట్. ఇంకా కొందరికి ఉద్యోగమన్నా వచ్చి వుండేది. ఎట్లాగో నిరక్షరాస్యత పోయేందుకుకొన్ని శతాబ్దాలు పడుతుంది." ఏదో పెద్ద జాతీయ సమస్యను పరిష్కరించినట్లు తన తెలివికి తనే మురిసిపోతూ అన్నాడా కౌంటర్‌లో వ్యక్తి.




"ఎట్టాగైనా రాసియ్యినాయనా. శానా అరజంటు. ఎంత తొందరగా జాబు సేత్తే అంత మంచిది." ముసలాయన బ్రతిమాలుతున్నాడు.

"ఇంకా నయం. తీరా జాబు రాసినాక, నీవే తీసుకపోయి అర్జంటుగా నా కొడుక్కిచ్చిరా నాయనా! అనగలవు పో వయ్యా, బయట అంతమంది జనం ఉన్నారే ఎవర్నో ఒకర్నడిగి రాయించుకో పో!" దాదాపు కసురుకున్నట్లే చెప్పాడా కౌంటర్‌లో వ్యక్తి.

ముసలాయన ఉసూరుమంటూ, గలగలమంటూ కబుర్లు చెప్పుకుంటున్న ఇద్దరు కాలేజీ అమ్మాయిల దగ్గరికొచ్చాడు.

"అమ్మా! ఈ జాబుముక్క రాసిస్తారా?" అని వాళ్ళ మొఖాల్లోకి దైన్యంగా చూశాడు.

చీరలు, సినిమాలు, కాలేజి అబ్బాయిల్ని గుంచి మాట్లాడుకుంటున్న వాళ్ళ చెవులకి ముసలాయన మాటలు సోకటం లేదు.

ఇంతలో ఇంకో జడ వచ్చి వాళ్ళని చేరింది. ముగ్గురమ్మాయిలు చేరితే ముప్పై మంది అబ్బాయిల్నిమించి గోల చేయగలరన్నట్లుంది వాళ్ళ వ్యవహారం.

"అమ్మా! ఈ జాబు రాసిపెడ్తారా?" ఆఖరిసారిగా ప్రయత్నించాడు.

"ఏమయ్యా! మాట్లాడుకుంటుంటే డిస్టర్బ్ చేస్తావు! మానర్‌లెస్" అందొక జడ.

"పల్లెటూరిబైతు!" అంది అందులో ఒక హైహీల్డ్ షూ.

"ఒట్టి కంట్రీమాన్!" అందొక వానిటీ బాగ్.

వాళ్ళ మాటలు పూర్తిగా అర్థం గాకున్నా విషయం తెలిసినవాడై ముందుకు సాగాడు—బెంచిపై కూర్చుని దిన పత్రిక లోకి ఇసుకలో నిప్పుకోడిలా తలదూర్చిన ఆసామిని చూసి ఆగాడు.

నల్లకళ్ళద్దాలు కళ్ళకి. కాళ్ళకి నల్లని బూట్లు, ఎడమ చేతికి రోల్డ్‌గోల్డ్ చైను గడియారం, ఖద్దరు సిల్కు జుబ్బా, పంచె. ఆసామి ఘనంగానే కన్పిస్తు న్నాడు

"అయ్యా నా కొడుక్కి ఈ కార్డురు రాసి పెడ్తారా." అడిగాడు ముసలాయన.

పేపరు కిందికి దించాడో లేక పైకెత్తాడో తెలియదుగానీ, మొత్తానికి ముసలాయనవంక ఎగాదిగా చూశాడు.

"ఏందీ?!" అని రాగం తీశాడా పెద్ద మనిషి. మళ్ళీ చెప్పాడు ముసలాయన.

"పేనాలేదు" అన్నాడా పెద్ద మనిషి నిర్లక్ష్యంగా.

ఖద్దరుజుబ్బా చిన్న జేబులో వున్న పెన్నును చూపించాడు ముసలాయన.

"పేనా ఉందా. ఉంటే ఉంటుంది. అందులో ఇంకు లేదు." జంకులేకుండా బుకాయింపుతో కూడిన అబద్ధం. దెబ్బ తిన్న అహంతో కూడిన అసహాయత, అసహనం ఆ పెద్దమనిషి ముఖంలో కనిపించాయి ముసలాయనకు.

మెల్లగా అడుగులు వేస్తూ, పోస్ట్‌కార్డ్ చేతిలో పట్టుకొని గణేశ్, రాజులను సమీపించాడు.

వాళ్ళింకా మాట్లాడుతూ నవ్వుతూ తుళ్ళుతున్నారు.

"నాయనా! ఇది కొంచెం నా కొడుక్కి రాసిస్తారా?" అన్న ముసలాయన మాటలు, తమ అభిమాన హీరో ఫొటోకి బెంగుళూరునుండి పూలదండలు తెప్పించే ఏర్పాట్లు, ఊరేగింపుల సన్నా హాల హీటెడ్ డిస్కషన్స్‌లో పడి, వాళ్లు వినిపించుకోలేదు.

"నాయనా! ఈ జాబు రాసిపెడ్తారా?" ముసలాయన మళ్ళీ అడగడానికి నోరు తెరిచాడు.

...............

"నా కొడుకు మిలిట్రీలో ఉండాడు. వాల్లమ్మ కండ్లల్లో వొత్తులు పెట్టుకొని ఆడికోసం పానాలు నిలుపుకోనుండాది. శానా రోజులు బతకదు. సివరగా ఆడ్ని సూసి పానాలు వదలాలనుండాది. ఈ జాబు సేరితే వాడు రెక్కలు కట్టుకొని వాల్తాడు. నాయనా! ఈ జాబు." ముసలా యన మళ్ళీ మళ్ళీ అడిగాడు.

ఆతురత, ఆందోళన, దైన్యం మూర్తీభవించాయి ముసలాయనలో.

"పోవయ్యా! అ క్కడంతమంది వుంటే ఎవరైనా అడగరాదా, మేం ఇంపా ర్టెంట్ విషయాలు డిస్కస్ చేసుకుం టుంటే తెలియటంలేదా?" అని విసు క్కున్నాడు రాజు.

"ఒక రౌండ్ అందర్నీ అడిగే మనదగ్గరి కొచ్చాడురా. మనల్ని వదిలేట్టు లేడు శనిగాడు" ముసలాయన్ని అంత వరకు అప్పుడప్పుడు గమనిస్తుండిన గణేష్, రాజుకు మెల్లగా చెప్పాడు.

"పెద్దబోరుగాడే అయితే" అన్న రాజు మాటలకు ఇద్దరూ నవ్వుకున్నారు.

ముసలాయన వాళ్ళిద్దరివంక ఆశగానే చూశాడు. ముసలాయన వాళ్ళిద్దరివంక అసహ్యంగా చూశ్లేదు!

"ఓ మై గడ్! మ్యాట్నీకి టైమవు తోంది వెళ్తారా, రాజా!" కవరు పోస్ట్ బాక్స్‌లో వేసి. మేడమెట్లు దిగుతూ అన్నాడు గణేష్.

"అయితే దండలు రెడీచేసి, ఊరే గింపుకు మన మిత్రులతో గాంధీపార్క్ దగ్గర నీ కోసం వెయిట్ చేస్తుంటా. మ్యాట్నీనుంచి అటే వచ్చేసెయ్"అంటూ రాజా కూడా మెట్లు దిగాడు.

ముసలాయన బెంచీమీద కూలబడ్డాడు. ఆలోచనలో పడ్డాడు.

"ఎంతమంది సదుకునోళ్లు ఒక్కరూ ఉత్తరం ముక్క రాసియ్యరే. ఇంటికాడ ముసిల్దాని కేమని సెప్పాలబ్బా ? పొద్దున కాడ ఎవురి మొకం సూసినానో...." అను కొని గుడిసెలో వుండేది తామిద్దరమే అని. ఒకరి మొకం ఒకరు చూసుకోవాల్సిందే గదాని గుర్తు తెచ్చుకుని నొచ్చు కున్నాడు.

"సదువులేని ఎదవని. విద్దె లేనివాడు వింత పశువంటారు" అనుకున్నాడు.

"విద్య వున్న వింత పశువులు వీళ్ళు" అని మాత్రం అనుకోలేదు! తన ప్రాణా నికి ప్రాణం. తన రక్తం అయిన ఒక్క గానొక్క కొడుకు వీళ్ళందరికోసం. ఈ దేశంకోసం—తన ప్రాణం. తనరక్తం ధారపోసి సరిహద్దుల్లో యుద్ధంచేస్తున్నాడు. వీళ్ళల్లో ఒక్కరైనా తన కొడుక్కి ఒక్క ఉత్తరముక్క రాసియ్యమంటే రాసివ్వలేదు—" అని కూడా అనుకోలేదు! కోపగించుకోలేదు

"నా కర్మ—నా పారబ్దం. మా రెండు ముసిలి పానాలను కాపాడేదానికి అంత దువ్వకు పోయి నౌకిరీ సేస్తున్నాడు ! బతుకుతెరువు కానా పెద్దది"అనుకున్నాడు.

"ఇంత దేశాన్ని కాపాడేదానికి నా కొడుకు పానాలు ఒడ్డుతున్నాడ"ని గర్వ పడనూలేదు.

ఇంత నగరం – విశ్వవిద్యకు కేంద్ర మైన నగరం – ఇంతమంది విద్యావంతు లున్నా తన కొడుక్కి ఒక్క ఉత్తర ముక్క రాయించుకోలేక పోయిన తన అశక్తతకు, దురదృష్టానికి దిగులుపడ్డాడు. "విద్య వుంటేనే సంస్కారముంటుందా? విద్యలేని వాళ్ళకు సంస్కారముండ" దని తర్కించుకోనూలేదు.

వాళ్ళను శపించనూలేదు!

తననే శపించుకున్నాడు!!

ఈ నగరంలో – ఈ నాగరికత నట్ట నడుమ – ఈ జనారణ్యంలో తన రోదన అరణ్యరోదనమైంది.

ముఖం కడుక్కుని, డ్రెస్ మార్చు కొని. తన అభిమాన హీరో సినిమా మ్యాట్నీకి వెళ్ళాలని త్వరత్వరగా రూమ్ చేరుకునా డు గణేశ్. ఆరు అంగల్లో సునాయాసంగా మేడ మెట్లెక్కి గది తలుపు తెరిచాడు. తలుపు సందుల్లోంచి వేసిన ఉత్తరం కాళ్ళదగ్గర కనిపించింది. చేతికి తీసుకున్నాడు. అక్షరాలు పరిచయ మైనట్టులేవు. "ఎవరి దగ్గర నుంచబ్బా" అనుకుంటూ ఉత్తరం తెరిచి చదవటం మొదలు పెట్టాడు.

"చిరంజీవి గణేశ్‌కు. నీ తల్లి దీవించి వ్రాయించుకున్న జాబు.

నాయనా! ఏడుకొండలవాడి దయతో నా ఆరోగ్యం బాగుంది. డాక్టరు ఇంటి కెళ్ళొచ్చు. డిస్చార్జి చేస్తామంటున్నారు వారం రోజుల నుండి. కానీ మీకీసంతోష

విషయం తెలియజేసి తొందరగా వచ్చి మీ అందర్నీ చూడాలనుంది. కానీ జాబు రాసే దిక్కు లేదు. ప్రతిసారి నీకు గానీ, మీ నాయనకుగానీ, జాబు రాయిం చాలంటే ఎంత అవస్థపడతానో, ఎందర్ని అడుక్కుంటానో నీకు తెలియదు. జాబు రాయించుకోవాలన్నా, చదివించు కోవా లన్నా ఎందర్ని ప్రతిమాలాలో. వారం వారం రాసే నీ జాబుకు జవాబురాయలేదని నీవు బెంగ పెట్టుకుంటావు. బెంగ పెట్టు కుని నీ చదువు పాడుచేసుకుంటావో. ఏమో. నర్సమ్మలను రాసివ్వమంటే— ఒకమ్మ "రేపు రాస్తా-మాపు రాసిస్తా- తీరిక లేదు" అంటుంది. ఇంకో అమ్మ కసురుకొని, "జాబులు రాసి పెట్టడాని క్కాదు మేముండేది రోగులకు సేవ చేయడానికని" దీర్ఘం తీస్తుంది. ఈ ఆడవాళ వార్డులో అందరూ చదువురాని నాలాంటోల్లే. ఇపుడు జాబు రాయిస్తున్న. కొత్తగా వచ్చిన సుశీలమ్మ తప్ప. ఒక సారి నర్సమ్మలందరు కూర్చుని నవ్వు కుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. నీకు జాబు రాయించాలని వెళ్ళాను. "అబ్బా! శనిగ్రహం కవరు పట్టుకొని వస్తోందిరా బాబో! జాబు వ్రాయించం డంటూ" అనటం విన్నా....

జాబు చదవటం మానేసి, ముఖం కడిగి నీటుగా డ్రెస్ చేసుకోవటం వదిలేసి, గదికి తాళం వేసి, తాళం చెవి జేబులో వేసుకున్నాడు. జేబులో వున్న తన అభి మాన హీరో "ఆంధ్రుల అందాల" నటుడి సినిమా మ్యాట్నీ షోకి తీసుకున్న టికెట్ ముక్కలు ముక్కలుగా చింపి విసిరేశాడు. అవి గాలికి చెల్లాచెదురుగా వచ్చి మెట్లమీద పడ్డాయి. అవి తొక్కు కుంటూ మేడమెట్లు గబగబా దిగాడు. ఇపుడు గణేష్ మనసులో తన అభిమాన హీరోలేడు. "బాబూ! ఈ జాబు రాసి పెట్టారా" అని దీనంగా, ఆందోళనగా, అందర్నీ అర్థిస్తున్న ముసలాయనే తన మనసంతా ఆవరించుకున్నాడు.

దాదాపు పరుగులాంటి నడకతో- ఎత్తుగావున్న మేడమెట్లన్ని ఎక్కి- గణేష్ పెద్ద పోస్టాఫీసు చేరుకున్నాడు.

---

## ✻ ఒకసారి ✻

**రాయాపురం రమేష్**

ఏడాది కోసారి
పచ్చని చెట్లన్ని
ఆకులు రాల్చేస్తే
ఎరుపుగా మార్చేసి
పెరగండి గగనాన్కి
పూయండి పూతల్ని
కాయండి కాయల్ని
అంటుంది.... అవని.

అయిదేండ్ల కోసారి
ఓట్లన్ని గైకొని
ఓటర్ల రక్తాన్ని
క్రూరంగ పీల్చేసి
అయిదేండ్లు జల్సాగ
దేశాల్ని తిరిగేసి
మరలి వస్తారు
మా మంచి....నాయకులు